సాక్షి మెదక్

శనివారం । 12 । అక్టోబర్ । 2024



దసరా.. సొంతూరు సరదా

దసరా.. వచ్చిందంటే అందరికీ సరదానే.. అందరూ తిరిగి సొంతూరుకు రావడంతో ప్రతి పల్లె సందడిగా మారింది. తాత, నానమ్మ, అమ్మమ్మ.. ఇలా బంధువులందరితో కలిసి సంబరాల్లో మునిగిపోయారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని నాటి మధురజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కొన్నేళ్లుగా విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఈసారి పల్లెలకు చేరుకోవడం విశేషం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 6లో ▸



న్యూస్‌రీల్

దసరా స్నేహభావాన్ని పెంపొందిస్తుంది

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దసరా పండుగ ధనిక, పేద తారతమ్యం లేకుండా అందరిలో స్నేహభావాన్ని పెంపొందించి సమాజం ఐక్యమత్యంతో ఉండేలా చేస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలకు ఆయన దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ సేవలో కలెక్టర్



ఏడుపాయలలో కలెక్టర్ కుటుంబ సభ్యులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మను జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద, కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మండల పరిధిలోని పొడిచన్‌పల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని చెప్పారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాలధారులు

సంగారెడ్డిటౌన్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని భవాని మందిరం వద్ద మాలాధారణ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యాంత్రిక జీవనంలో సనాతన ధర్మమే రక్షణ

- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



వర్గల్ అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ లక్ష్మణ్ దంపతులు

వర్గల్(గజ్వేల్): యాంత్రిక జీవనంలో సనాతన ధర్మమే రక్షణగా నిలుస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో ఒత్తిడి తట్టుకోలేక యువత ధర్మం పట్ల ఆకర్షితులవడం శుభ పరిణామన్నారు. ఓట్ల కోసం లౌకికవాదం పేరిట కొందరు సనాతన ధర్మాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందన్నారు. హిందూ సమాజం జాగృతం కావాలని, లౌకికవాదుల చర్యలు అడ్డుకునేలా మరింత చైతన్యవంతనం కావాల్సిన అవసరముందన్నారు. వర్గల్ విద్యాధరి క్షేత్రం అద్భుతమని, ప్రధాన క్షేత్రాలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత చంద్రశేఖర సిద్ధాంతికే దక్కుతుందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

సిద్ధిధాత్రి దేవిగా..



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గాభవాని మాత శుక్రవారం సిద్ధిధాత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు శనివారం రాజరాజేశ్వరి అలంకరణతో భక్తులకు దర్శమిస్తారు.

మహిషాసుర మర్దినిగా..



ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మహిషాసుర మర్దినిగా దుర్గామాత దర్శనమిచ్చారు.

దుర్గాదేవిగా..




పటాన్‌చెరుటౌన్: డివిజన్ పరిధిలో నవపాన్ సమీపంలో కొలువైన రేణుక ఎల్లమ్మ శుక్రవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయీభవ..

నేడే 'విజయ'దశమి

- పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు





మెదక్ జోన్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెప్పుకునే విజయదశమి రానే వచ్చింది. శనివారం ఈ వేడుక జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రావణ దహనానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రోహిత్‌రావుతో పాటు కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ చైర్మన్ తదితరులు హాజరుకానున్నారు. మరోవైపు ఆలయాలన్నీ శమీపూజకు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా జమ్మి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేకంగా శమి పూజలు చేసి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. అదేవిధంగా పాలపిట్ట దర్శనం చేసుకోవడం ఆచారం.

వడివడిగా.. ఏడేళ్లు

- ఎనిమిదో వసంతంలోకి మెతుకుసీమ
- చేరువైన పాలన.. కానరాని ప్రగతి జాడ
- రైలుకూత, మెడికల్ కాలేజీ తలమానికం

మెదక్ నూతన జిల్లాగా అవతరించి ఏడేళ్లు పూర్తి చేసుకొని ఎనిమిదో వసంతంలోకి అడుగుపెట్టింది. ఏర్పాటుకు ముందు పాలనంతా సంగారెడ్డి కేంద్రంగా కొనసాగింది. ఏదైనా పనిపై వెళ్లాలంటే ఆర్థిక భారంతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రత్యేక జిల్లా కోసం డిమాండ్ పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనతో మెదక్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. 2016 దసరా కానుకగా ప్రత్యేక జిల్లాగా అవతరించింది.

– మెదక్‌జోన్



మెదక్ కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా నుంచి మెదక్ విడిపోయిన తర్వాత వడివడిగా అభివృద్ధి వైపు పయనిస్తోంది. 2022లో మెదక్‌కు రైలు రాగా, 2023లో జిల్లా సమీకృత కార్యాలయం, ఎస్పీ, జెడ్పీ భవనాలు నిర్మించడంతో ప్రజలకు పాలన చేరువైంది. అంతకుముందు మహిళా శిశు (ఆస్పత్రి) భవన నిర్మాణంతో గర్భిణులు, చిన్నారులకు వైద్యం అందుబాటులోకి వచ్చింది. తాజాగా గత నెలలో మెడికల్ కళాశాల మంజూరు చేసి ఈ ప్రాంతంలో వైద్య విద్యకు పెద్దపీట వేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు మెరుగుపడింది. ఉమ్మడి జిల్లాలో అధికారులు పర్యటించాలంటే కష్టతరమయ్యేది. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో కలెక్టర్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులు నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

కానరాని పర్యాటకం..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి జిల్లాకే తలమానికం. పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో గల పోచారం అభయారణ్యంలోని జింకల ప్రత్యుత్పత్తి కేంద్రం.. దాని పక్కనే సహజ సిద్ధమైన కొండలు, గుట్టలు మధ్య నిజాంపాలనలో నిర్మించిన పోచారం ప్రాజెక్టు అందాలు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దేవస్థానం లాంటి పర్యాటక కేంద్రాలు గత చరిత్రకు అద్దం పడుతున్నాయి. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని గత పాలకులు సర్వేలు చేయించినా కాగితాలకే పరిమితం అయ్యాయి.

ఉన్నత విద్య.. అందని ద్రాక్ష..

మెదక్ పట్టణ ప్రజలకు ఉన్నత విద్య నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. కేంద్రీయ విద్యాలయాలు లేవు, ఇంజనీరింగ్, పీజీ లాంటి కాలేజీలు అందుబాటులో లేకుండా పోయాయి. ఉన్నత చదువులకు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పూర్తికాని కాల్వల నిర్మాణం

జిల్లాలో చెప్పుకోదగ్గ సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు బోరుబావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నారు. బోరుబావుల తవ్వకాల కోసం ఏటా రూ. లక్షలు అప్పు చేసి ఆర్థికంగా ఇబ్బందుల పాలు అవుతున్నారు. కాళేశ్వరం కాలువల ద్వారా సాగునీటిని అందిస్తామని చాలా కాలంగా పాలకులు చెబుతున్నా.. నేటికీ కొన్ని మండలాల్లో భూ సేకరణ సైతం చేపట్టలేదు. కాల్వల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తే అన్నదాతలకు సాగు నీటి కష్టాలు తప్పి ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

నిలిచిన పనులు

జిల్లా కేంద్రంలో గోసముద్రం, పిట్లం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు ఆరేళ్ల క్రితం రూ. 9 కోట్లు మంజూరు చేశారు. కాగా కొంతమేర పనులు సైతం చేపట్టారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన సుందరీకరణ పనులు మిగిలిపోయాయి. అలాగే పట్టణ నడిబొడ్డున గల రాందాస్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, బోధన్ చౌరస్తాలో ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదు. రోడ్డు విస్తరణలో భాగంగా అంబేడ్కర్, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహాలను తొలగించిన అధికారులు వాటిని తిరిగి ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక నిధులు మంజూరు చేయించి జిల్లాను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలతో సతమతం

ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన ఆశించిన ప్రగతి సాధించడంలో పాలకులు విఫలమయ్యారు. ముఖ్యంగా మెదక్ రింగ్ రోడ్డు లేక ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. మెదక్ నుంచి హైదరాబాద్, బోధన్, నిజామాబాద్ లాంటి నగరాలకు వెళ్లాలంటే మెదక్ మధ్య నుంచే వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో పట్టణంలో ఏ చిన్నపాటి సభలు, సమావేశాలు నిర్వహించినా గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. అత్యవసరంగా మెతుకుసీమకు రింగ్‌రోడ్డు మంజూరు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

రసాభాసగా చెక్కుల పంపిణీ

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల పోటాపోటీ నినాదాలు



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. శుక్రవారం వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బతుకమ్మ పండుగకు ప్రభుత్వం చీరలు పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చీరలు అందించక పోగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. మహాలక్ష్మి పథకం, రుణమాఫీ అసంపూర్తిగానే చేపట్టారని మండిపడ్డారు. ఈ క్రమంలో కార్యాలయం బయట ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారిక కార్యక్రమంలో చెక్కులు పంపిణీ చేయకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. ఎస్‌ఐ రాజు సిబ్బందితో కలిసి ఇరువర్గాలను శాంతింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చివరికి సమావేశ మందిరం తలుపులు మూసివేసి ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు గుండాలు, రౌడీ ల్లాగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సహనాన్ని అసమర్థతగా భావిస్తే తీవ్ర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చేతనైతే మండల అభివృద్ధికి నిధులు తేవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కృష్ణ, జ్ఞానజ్యోతి, గిర్దావర్ ధన్‌సింగ్, జయభారత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

పాపన్నపేట(మెదక్): వైద్య సేవలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శ్రీరాం సూచించారు. శుక్రవారం పాపన్నపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సకాలంలో విధులకు రావాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ హరిప్రసాద్, సీహెచ్‌ఓ చందర్, సిబ్బంది ఉన్నారు.

ఆస్తిలో వాటా కోసమే..

- పసిపాప కిడ్నాప్
- 30 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి జోన్: భర్త ఆస్తిలో వాటా పొందేందుకు పసిపాపను కిడ్నాప్ చేసిన ఘటన పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. కిడ్నాపైన 30 గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించి పాపను గుర్తించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్ వివరాలు వెల్లడించారు. పట్టణానికి రుక్సానాబేగానికి 16 ఏళ్ల క్రితం దస్తగిరితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కొద్దిరోజుల క్రితం దస్తగిరి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో హైదరాబాద్‌లోని బోరబండలో నివాసం ఉంటూ పాతబస్తీకి చెందిన మహ్మద్ సమీర్‌ను పెళ్లి చేసుకుంది. పిల్లలు అయ్యే అవకాశం లేకపోవడంతో ఆస్తిలో వాటా కోసం డబ్బులకు ఎవరైనా పిల్లలు ఇస్తారని ప్రయత్నం చేసింది. ఫలితం లేకపోవడంతో కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకుంది. ఈనెల 9వ తేదీన చిన్నమ్మ కూతురు ముస్కాన్ బేగంతో కలిసి స్కూటీపై సంగారెడ్డికి చేరుకుంది. తల్లి సయిదా బేగం, చెల్లెలు జువేరియా బస్సులో సంగారెడ్డికి వచ్చారు. నలుగురు కలిసి ప్రభుత్వ ఆస్పత్రి వెనుక నుంచి వెళ్లి పసిపాపను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్ బోరబండలో వీరిని గుర్తించి చాకచక్యంగా పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో డీఎస్పీతో పాటు సదాశివపేట ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, ఎస్‌ఐ వినయగౌడ్, వియన్, హరిశంకర్‌గౌడ్, సిబ్బందిని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అభినందించారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

బడి.. సకల వసతుల ఒడి

- ఉమ్మడి జిల్లాకు 3 సమీకృత గురుకులాలు
- మొదటి విడతలోనే మంజూరు
- ఏర్పాటుకు యంత్రాంగం కసరత్తు



నారాయణఖేడ్: కులమతాలకు అతీతంగా విద్యార్థులంతా ఒకేచోట విద్యను అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ (సమీకృత) గురుకులాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలో మొదటి విడతగా మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గమైన అందోల్‌తో పాటు నారాయణఖేడ్‌కు, సిద్దిపేట జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గమైన హుస్నాబాద్‌కు కలిపి మూడు గురుకులాలను మంజూరు చేసింది. విశాలమైన 25 ఎకరాల స్థలంలో గురుకులాల నిర్మాణం చేపట్టనుంది. 4వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు వీటిలో విద్యాబోధన ఉండనుంది. బ్లాక్ బోర్డులు కాకుండా డిజిటల్ స్మార్ట్ బోర్డులను ఏర్పాటు చేసి వాటి ఆధారంగా బోధన జరగనుంది. ఇందులోనే కంప్యూటర్ విద్యాబోధన సైతం అందించనున్నారు.

పేద పిల్లలకు నాణ్యమైన బోధన

పేద విద్యార్థులకు ఉన్నతస్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తోంది. ప్రతిభావంతమైన పిల్లలకు ప్రోత్సాహం లేక.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్న పాఠశాలల్లో చదువుకొనే స్థోమత లేక వెనకబడిపోతున్నారు. దీనిని అధిగమించి ప్రపంచస్థాయిలో ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశాలు ఈ గురుకులాల ద్వారా లభించనున్నాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ కోర్సులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నీట్, ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

25 ఎకరాలు.. అధునాతన సదుపాయాలు

25 ఎకరాల విశాలమైన చక్కటి వాతావరణం గల ప్రాంతంలో ఒకే క్యాంపస్‌గా గురుకులం నిర్మాణం జరగనుంది. ఒక్కో గురుకులంలో 2,560 మంది విద్యార్థులు, 120 మంది అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోర్డులతో తరగతి గది, కంప్యూటర్ ల్యాబ్‌లు, యాంపి థియేటర్ తదితర అధునాత సదుపాయాలు ఉంటాయి. 900 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చొని భోజనం చేసేలా భారీ డైనింగ్ హాల్, ఒక్కో గదిలో 10 మంది విద్యార్థులు ఉండేలా బెడ్స్, గదికి రెండు చొప్పున బాత్‌రూంల నిర్మాణం చేపట్టనున్నారు. బాల, బాలికలకు వేర్వేరు హాస్టళ్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి నివాస సౌకర్యాలు సైతం ఏర్పాటు చేస్తారు. ఆటలకు విశాలమైన ఇండోర్, అవుట్‌డోర్ గ్రౌండ్, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, ఓపెన్ జిమ్‌తో పాటు ఆడిటోరియం నిర్మించనున్నారు.

గురుకులం వరం



నారాయణఖేడ్ లాంటి వెనుకబడిన ప్రాంతానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకున్న గురుకులం మంజూరు కావడం వరం. నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్న బోధన జరగనుంది. ప్రతిభ గల విద్యార్థులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోగలరు. గురుకులం మంజూరుకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి కృషి అభినందనీయం.

– చంద్రశేఖర్ ఆచార్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

పేద పిల్లలు ఉన్నతంగా ఎదగాలి



పేద విద్యార్థులు సైతం ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఇంటిగ్రేటెడ్ గురుకులం దోహదం కానుంది. ఖేడ్‌కు మొదటి విడతలో గురుకులం మంజూరు కావడానికి మంత్రి దామోదర, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డి సహకారం మరువలేనిది. వారికి రుణపడి ఉంటా.

– డాక్టర్ సంజీవరెడ్డి, ఎమ్మెల్యే నారాయణఖేడ్

ప్రభుత్వ స్థలం ఎంపిక



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): నియోజకవర్గంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. శుక్రవారం సిర్గాపూర్ మండలం వాసర్ శివారులో ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. ఖేడ్ ఆర్డీఓ అశోక్‌చక్రవర్తితో కలిసి సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు.

పట్నం పల్లెటూర్



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

తూప్రాన్: అతిపెద్ద పండుగ అయిన దసరాకు ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. పండుగకు బంధువులు, స్నేహితులను కలుసుకోవడానికి అవకాశం ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిబాట పట్టారు. ఆర్టీసీ బస్సులు, సొంత, ప్రైవేట్ వాహనాల్లో పల్లె బాట పట్టడంతో తూప్రాన్ టోల్ ప్లాజా శుక్రవారం సాయంత్రం రద్దీగా మారింది.

క్లుప్తంగా

శంకర్ పాటిల్‌కు 'శరణ నాయక్' అవార్డు



శంకర్ పాటిల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్ పాటిల్‌కు అంతర రాష్ట్రీయ లింగాయత్ ధర్మ సమాజ్ 'శరణ నాయక్' అవార్డును అందజేసింది. కర్నాటక రాష్ట్రంలోని బసవ కల్యాణ్‌లో జరుగుతున్న శరణ విజయోత్సవ సదస్సులో భాగంగా శుక్రవారం అవార్డు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. జగద్గురు స్వర్గీయ మాత మహాదేవి స్థాపించిన రాష్ట్రీయ బసవదళ్‌లో చేరిన శంకర్ పాటిల్ రాష్ట్రంలో లింగాయత్ సమాజ్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. పట్టణ కేంద్రంగా రాష్ట్రీయ బసవదళ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. విశ్వగురు బసవేశ్వరుడి ప్రవచనాలను ముందుకు తీసుకెళ్తూ.. ఊరూరా ఆయన విగ్రహాలను ప్రతిష్ఠింపజేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేశారు.

బ్యాంకులకు వెళ్లకుండా ఏటీఎం ద్వారా సేవలు

ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



డీసీసీబీ ఏటీఎంను ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజలకు బ్యాంకు సేవలు దగ్గర చేసేందుకు ఏటీఎంలు దోహదపడుతాయని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో గల డీసీసీబీ బ్యాంకు ఆవరణలో ఏటీఎం సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకులకు వెళ్లకుండా ఏటీఎంల సేవలను ఉపయోగించుకునేలా కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏటీఎం సేవలు అందుబాటులోకి తెచ్చేలా చూస్తున్నామన్నారు. అన్ని రకాలు రుణ సహాయాన్ని డీసీసీబీ ద్వారా రైతులు పొందేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్, డీజీఎం విశ్వేశ్వర్, ఏజీఎం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక బ్యాంకు మేనేజర్ సుధారాణి, పీఏసీఎస్ సీఈఓ రాజు, డైరెక్టర్లు బూర్గుల సురేందర్‌రావు, నర్సింహ్మాచారి, మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు కనకరాం తదితరులు పాల్గొన్నారు.

యువతికి వేధింపులు

యువకుడిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: యువతిని వేధింపులు గురి చేస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మెదక్ జిల్లా సిర్గాపూర్ మండలం అంతర్గామ్ తండాకు చెందిన రాజేశ్వరి ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ, స్థానికంగా పీజీ మహిళా వసతి గృహంలో ఉంటుంది. ఆరు నెలల కిందట ఆటోడ్రైవర్ నేనావత్ రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి బయటికి వెళ్లిన సమయంలో నేనావత్ రెడ్డి ఫొటోలు తీసుకున్నాడు. రెండు నెలలుగా అతడి ప్రవర్తన నచ్చని యువతి మాట్లాడటం మానేసింది. అయితే, తనతో మాట్లాడాలని లేకుంటే తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. మళ్లీ ఈనెల 10వ తేదీన పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి వద్ద యువతి ఫోన్ లాక్కొని అసభ్యకరంగా ప్రవర్తించాడు. శుక్రవారం మరోసారి బెదిరింపులకు దిగడంతో బాధితురాలు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దసరా.. సొంతూరు సరదా

- ఏళ్ల తర్వాత గ్రామానికి వచ్చిన ఎన్ఆర్ఐలు
- విదేశాల్లో స్థిరపడ్డా పండుగకు విమానం ఎక్కాల్సిందే
- ఇళ్లలో సందడి వాతావరణం
- సంతోషాలు, జ్ఞాపకాలు సాక్షితో పంచుకున్న పలువురు



తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండుగ దసరా. శనివారం పండుగా కావడంతో పట్టణాలు, విదేశాల్లో స్థిర పడ్డవారు సొంత ఊరికి చేరుకున్నారు. దీంతో పల్లెల్లో కొంత సందడి వాతావరణం నెలకొంది. చాలా మంది ఏళ్లకొద్ది సొంత ఊరికి రాకుండా ఉన్నవారు సైతం పండుగకు పల్లెటూరికి చేరుకున్నారు. ఈ క్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. తాత, నానమ్మ, అమ్మమ్మ.. ఇలా బంధువులందరితో ముచ్చటిస్తున్నారు. ఉద్యోగ రీతాయ బయటి దేశాలకు వెళ్లి దసరా పండుగకు సొంతూరికి వచ్చిన ఎన్ఆర్ఐలు తమ సంతోషాన్ని, జ్ఞాపకాల్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

'జమ్మి' శోభితం..

వర్గల్(గజ్వేల్): జమ్మి..పూజనీయ వృక్షం. దసరా రోజున ఈ వృక్షాన్ని పూజిస్తారు. విజయాలు సిద్ధింపజేయాలని ప్రార్థిస్తారు. ఆకులను (శమీ పత్రాలను) తీసుకెళ్లి పంచి పెడతారు.. అలాంటి పూజనీయ శుభకరమైన జమ్మి వృక్షాల సముదాయాన్ని తనలో ఇముడ్చుకొని సిద్దిపేట జిల్లా తున్కిఖాల్సా పల్లె ప్రకృతి వనం ప్రత్యేకంగా నిలుస్తుంది. గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ఒకే చోట 5 జమ్మి వృక్షాలు పెరిగాయి. అక్కడే జమ్మి పూజ జరిగేది. అలాంటి చోటు జమ్మి వృక్షాల కేంద్రంగా పల్లె ప్రకృతి వనంగా 2019లో కార్యరూపం దాల్చింది. రెండెకరాల విస్తీర్ణంలో జమ్మి చెట్లు మధ్యలో ఉండేలా పచ్చనిలాన్‌తో, చుట్టూరా వృత్తాకారంలో గద్దెను నిర్మించారు. అక్కడే భారతమాత విగ్రహం, దేశభక్తికి చిహ్నంగా ఎత్తైన జాతీయ జెండా కొలువుదీరాయి. తున్కిఖాల్సా గ్రామ పేరు మొదటి అక్షరం వచ్చేలా 'లవ్ టీకే' సింబల్ ఏర్పాటు చేశారు. జమ్మి చెట్టు వద్ద పఠించాల్సిన శ్లోకాన్ని పలకంపై ముద్రించి ఏర్పాటు చేశారు. ఏళ్ల చరిత్ర కలిగిన జమ్మి వృక్ష సముదాయంతో శోభాయమానంగా రూపుదిద్దుకున్న ఈ పల్లెప్రకృతి వనంలోనే ఊరు ఊరంతా దసరా వేడుకల్లో పాల్గొంటారు.



జమ్మి వృక్ష సముదాయంతో తున్కిఖాల్సా పల్లె ప్రకృతి వనం

అమెరికా టూ దుబ్బాక



అమెరికా నుంచి దుబ్బాకకు వచ్చిన ఎన్ఆర్ఐ కుటుంబాలు

దుబ్బాక: సిద్దిపేట జిల్లా నుంచి ఉన్నత చదువులు చదివి అమెరికా వెళ్లిన మొట్టమొదటి వారు దుబ్బాక పట్టణానికి చెందిన సిరిపురం గుండెరావు వేద దంపతులు. 1970 వ దశకంలో 54 ఏళ్ల కిందట గుండెరావు తన సతీమణి వేదతో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడే సాఫ్ట్‌వేర్ నిపుణులుగా పని చేసి రిటైర్ అయ్యారు. తన పిల్లలతో కలిసి అక్కడ స్థిరపడ్డ దంపతులిద్దరూ 15 రోజుల కిందట దసరా పండుగకు సొంతూరు దుబ్బాకకు వచ్చారు. ఈ సందర్భంగా సాక్షితో వారి ఆనందాన్ని పంచుకున్నారు.

15 ఏళ్ల తర్వాత పండుగకు వచ్చాం : గుండెరావు, వేద దంపతులు, ఎన్ఆర్ఐ

మేము 54 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లాం. అక్కడే వర్జీనియా రాష్ట్రంలో స్థిరపడ్డాం. మాకు ఇద్దరు కుమారులు,కూతురు ఉంది. అమెరికాలో ఉన్నా మన సంస్కృతీ, సాంప్రదాయాలు మరువలే. మా పిల్లలకు, మనువళ్లు, మనువరాళ్లకు సైతం నేర్పించాం. ఆహారపు అలవాట్లు కూడా ఇక్కడివే పాటిస్తాం. ప్రతీ పండుగను మా ఇంట్లో (అమెరికాలో) అందరం కలిసి జరుపుకుంటాం. ఇప్పుడు దసరాకు ఇండియా రావడం చాలా సంతోషంగా ఉంది. ఎప్పుడో 15 ఏళ్ల కిందట దసరాకు వచ్చాం మళ్లీ ఇప్పుడే వచ్చాం. దసరా పండుగ దుబ్బాకలో చాలా ఘనంగా జరుగుతుంది. చిన్న తనంలో దుబ్బాకలో అందరం కలిసి సాయంత్రం వేళలో మా చేనుకి వెళ్లి పాలపిట్టను చూసి జంబి చెట్టుకు పూజ చేసి ఆకు (బంగారం) తెచ్చుకొని అందరికీ పెట్టేవాళ్లం. పాత జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొని 81 ఏళ్ల వయస్సులో ఉన్న గుండెరావు, 69 ఏళ్ల వేద దంపతులు తమ ఆనందాన్ని పంచుకున్నారు.

అమెరికాలోనూ జరుపుకుంటాం : ప్రేమలత కిషన్‌రావు దంపతులు

అమెరికాలో సైతం అన్ని పండుగలు జరుపుకుంటాం. నేను అమెరికాలో వాషింగ్టన్ స్టేట్‌లో ఉన్నా. నాసాలో పని చేసి రిటైర్ అయ్యా. కొద్ది నెలల కిందట హైదరాబాద్‌కు వచ్చాం. మా పిల్లలు అక్కడే ఉంటారు. మేము ఇండియాకు వచ్చినప్పుడు తప్పకుండా దుబ్బాకకు వస్తాం. దుబ్బాకలో దసరా పండుగ చాలా బాగా జరుగుతుంది.

దసరాకు ఇండియాకు వచ్చాం : ఎర్రవెల్లి భారతీ, వాషింగ్టన్ డీసీ

నాకు ఇప్పుడు 70 ఏళ్లు. మేము అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంటాం. దసరాకు ఇండియా రావడం మా అమ్మమ్మ గారి ఊరు దుబ్బాకకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడికి వచ్చాక చిన్నతనంలో మేము గడిపిన రోజులు గుర్తుకొస్తున్నాయి. దసరా సెలవుల్లో దుబ్బాకకు వచ్చి చాలా ఆనందంగా గడిపేవాళ్లం. అమెరికాలో ఉన్నా అన్ని పండుగలు అక్కడ అందరం కలిసి జరుపుకుంటాం. ఇక ఇండియాలో దసరా పండుగకు రావడం నాకు మరచిపోలేని అనుభూతి.

ప్రతీ పండుగకు వస్తాం



ఇంట్లో దుర్గామాతకు పూజలు చేస్తున్న రాధాకృష్ణారెడ్డి దంపతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన టీవీ రాధాకృష్ణారెడ్డి, సింధురెడ్డి దంపతులు. సింధురెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి కుమారుడు చంద్రాన్ష్‌రెడ్డి ఉన్నాడు. ప్రతీ బతుకమ్మ, దసరా పండుగకు సొంత గ్రామమైన తిగుల్‌కు వస్తారు. ఈసారి దుర్గామాత(భవానీమాత)ను ఇంట్లోనే ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట మా ఇంటి నుంచే దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యేవని రాధాకృష్ణరెడ్డి తన జ్ఞాపకాలను పంచుకున్నారు. పట్టణంలో కంటే పల్లెటూరిలోనే పండుగ వాతావరణం, ప్రజల అనుబంధాలు, ఆత్మీయతలు బాగుంటాయని, అందుకే ప్రతీ పండుగకు పల్లెకు వస్తామని, కుటుంబ సభ్యులతో పాటు అమ్మ కూడా ఉంటుందని వివరించారు.

ఇదే మొదటిసారి..

తోటపల్లి గ్రామ ఎన్ఆర్ఐ దంపతులు

హుస్నాబాద్‌రూరల్: మా నాన్న పుట్టిన ఊరిలో దసరా చూడక 32 ఏళ్లు అవుతుందని, సద్దుల బతుకమ్మ ఆట పాటలు, స్త్రీల కోలాటం పల్లెటూరి ప్రకృతి అందాలు చూసి చాలా కాలం అవుతుండటంతో చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తున్నాయని ఎన్ఆర్ఐ దంపతులు జనగామ వంశీధర్ రావు, విజయ సాక్షితో తమ ఆనందాన్ని పంచుకున్నారు. హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన జనగామ మురళీధర్‌రావు ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తూ పిల్లలను విదేశాలకు పంపించాలనే లక్ష్యంతో చదివించారు. 2018లోనే స్వదేశం వచ్చిన మురళీధర్‌రావు పుట్టిన ఊరులో ఇల్లు కట్టుకొని విశ్రాంత జీవితం గడుపుతున్నాడు. ఈయన కుమారుడు వంశీధర్‌రావు, కోడలు విజయ మాత్రం 1993లోనే అమెరికాకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం వెళ్లారు. వీరి కూతురు విజయలక్ష్మి, అల్లుడు ప్రతాప్ కూడా అమెరికాలో స్థిరపడ్డారు. 30 ఏళ్ల నుంచి మురళీధర్‌రావు కుటుంబ అమెరికాలోనే స్థిరపడ్డా పుట్టిన ఊరుపై మమకారంతో పండుగలకు ఊరికి వస్తుంటారు. దసరా పండుగకు రావడం మాత్రం ఇదే మొదటిసారి. పూల బతుకమ్మ ఆటలు, కోలాట పాటలు పల్లె సంస్కృతిని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బంధువులు గ్రామస్తులతో ఆప్యాయంగా గడిపారు.



బతుకమ్మతో జనగామ మురళీధర్‌రావు కుటుంబం

బతుకమ్మ నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో మునిగి వ్యక్తి మృతి
- సదాశివపేట మండలంలో ఘటన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బతుకమ్మ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. చెరువులో మునిగి వ్యకి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మెలిగిరిపేట్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల రాములు(33) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 10న తన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మను గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. స్థానికులు వెంటనే వెలికితీసి సదాశివపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి తండ్రి పెద్దగొల్ల బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



మల్లేశం మృతదేహం

యువకుడు మృతి..

కంది(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కంది శంకర్‌పల్లి రోడ్డుపై చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ విశ్వజన్ కథనం మేరకు.. శంకర్‌పల్లికి చెందిన గద్దె వారి మల్లేశం (30) అల్లి వారి పరమేశ్ హోటల్ కార్మికులుగా పని చేస్తున్నారు. శుక్రవారం సంగారెడ్డి నుంచి బైక్‌పై శంకర్‌పల్లికి వెళ్తున్నారు. కందిలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద గల్లీలో నుంచి వస్తున్న జేసీబీ బైక్‌ను ఢీకొట్టడంతో పక్కనుంచి వెళ్తున్న డీసీఎం కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందగా పరమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు శ్యామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి

- రూ.3 లక్షలతో ఉడాయింపు
- షాపు నిర్వాహకులను మోసం

సిద్దిపేటకమాన్: నకిలీ బంగారం అంటగట్టి భారీగా డబ్బుతో ఇద్దరు ఉడాయించిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన ఉడుత రమేశ్, భార్య రేణుక స్థానిక ఇందిరమ్మ కాలనీలో లేడీస్ ఎంపోరియం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. 5వ తేదీన షాపునకు ఇద్దరు వ్యక్తులు వచ్చి మేము అన్నా చెల్లెళ్లమంటూ రేణుకతో మాటలు కలిపి పరిచయం చేసుకున్నారు. షాపులో పట్టీలు, గాజులు కొనుగోలు చేశారు. మాకు కొంత డబ్బులు అవసరం ఉన్నాయని బంగారం తీసుకొని డబ్బులు ఇవ్వాలని కోరారు. వారిని నమ్మించడానికి మొదటగా చిన్న బంగారు ముక్కను ఇచ్చి చెక్ చేసుకోమన్నారు. షాపు నిర్వాహకులు పరీక్షించగా అసలు బంగారంగా తెలిసింది. మరుసటి రోజు బంగారు ముక్కను తీసుకెళ్లారు. మళ్లీ తిరిగి 10న(గురువారం) అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని తమ దగ్గర బంగారం ఉందని సదరు ఇద్దరు వ్యక్తులు షాపు నిర్వహకులకు ఫోన్ చేసి మాట్లాడారు. పట్టణంలోని వేములవాడ కమాన్ వద్దకు వచ్చారు. రమేశ్, రేణుక నుంచి రూ.3 లక్షలు తీసుకొని నిందితులు 2 తులాల బంగారం ఇచ్చారు. వారు వెళ్లిపోయాక రమేశ్ ఆ బంగారాన్ని పరీక్షించగా నకిలీ బంగారమని తేలడంతో లబోదిబోమన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సైబర్ బాధితుల్లో విద్యావంతులే అధికం

- మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ
- అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ సందర్శన



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్, సైబర్ మోసాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతున్నారని మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ లో ఏర్పాటు చేసిన మినీ కమాండ్ కంట్రోల్ ను ప్రారంభించి సిబ్బందితో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో సైబర్ క్రైమ్ కేసుల రికవరీలో రాష్ట్రంలో జిల్లా మూడో స్థానం రావడం అభినందనీయమన్నారు. రిసెప్షన్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ప్రతీ పిటీషన్‌ను ఆన్‌లైన్ చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని సూచించారు. అదే విధంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు, బొల్లారం పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఎక్కువగా మైగ్రేట్ లేబర్ ఉంటారని, దొంగతనాలు జరగటానికి ఎక్కువగా అవకాశం ఉంటుందని, స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా పోలీసుల పని తీరు భేష్ అని, సిబ్బంది కొరతతో కొంత వరకు ఇబ్బందులు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవ రావ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఎస్ఐలు విజయ్, సోమేశ్వరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కారు డ్రైవింగ్‌కి వెళ్తున్నానని చెప్పి..

యువకుడు అదృశ్యం



వంశీ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన వంశీ(21) 6న సాయంత్రం ఇంటి నుంచి డ్రైవింగ్‌కి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తల్లి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సిద్దిపేటఅర్బన్: బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంటు స్తంభానికి ఢీకొని యువకుడు మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన గంగరబోయిన నాగరాజు (30) మేస్త్రీ పనులు చేస్తుంటాడు. అర్బన్ మండలం బొగ్గులోని బండ గ్రామంలోని అక్క ఇంటి నుంచి తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామానికి స్నేహితులను కలవడానికి శుక్రవారం ఉదయం బైక్‌పై వెళ్లాడు. స్నేహితులను కలిసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తడ్కపల్లి గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే కరెంటు స్తంభానికి ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగాచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- 51 గ్రాముల బంగారు అభరణాలు, 1.8 కిలోల వెండి స్వాధీనం
- ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి బంగారం వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా వెజ్‌గామ్ గ్రామానికి చెందిన అస్లామ్‌ఖాన్, షేక్ ఇలియాస్, షేక్ సమీర్ వాహనాల తనిఖీలో పట్టుకొని విచారించగా దొంగతనం విషయం బయటపడింది. చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో బంగారు అభరణాలు, వెండి పూజ సామగ్రితోపాటు హవేళిఘణపూర్ మండలం పోచమ్మరాళ్ తండాలో తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, చేగుంట మండలం చందాయిపేట గ్రామంలోని మల్లిఖార్జున స్వామి ఆలయం, హనుమాన్ ఆలయంలో వెండి మీసాలు, ఇత్తడి గంటలు చోరీ చేశారు. అలాగే కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామంలోని రామాలయంలో బంగారు, వెండి అభరణాలు, చేర్యాలలోని గిఫ్ట్ ఆర్టికల్ షాపు తాళం పగులకొట్టి రూ.62 వేల నగదును చోరీ చేశారు. నాందేడ్‌కు చెందిన ఈ ముగ్గురు స్థానికంగా ఇంటి నిర్మాణ పనులు నిర్వహిస్తూ ఆలయాలను పసిగట్టి దొంగతనాలకు పక్కా స్కెచ్ వేస్తున్నారని. అస్లామ్ ఖాన్ ఎలక్ట్రీషియన్‌గా, షేక్ ఇలియాస్ ప్లంబర్‌గా, షేక్ సమీర్ వర్కర్‌గా పనులు చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న తెలిపారు. ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతోపాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాను పట్టుకున్న చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, కానిస్టేబుల్ రాజశేఖర్‌లకు ఎస్పీ చేతులమీదుగా నగదు రివార్డును అందించారు.కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పండుగకి పంపలేదని మహిళ ఆత్మహత్య

రేగోడ్(మెదక్): బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దోసపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పోచయ్య శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం దోసపల్లి గ్రామానికి చెందిన సీమాన్‌తో పుత్రె రాణి (31)కి గత మే నెలలో వివాహం జరిగింది. గురువారం పండుగకి ఇంటికి వెళ్తానన్నది. రేపు వస్తామని భర్త అత్తతో చెప్పడంతో మనస్తాపం చెందిన రాణి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

భార్య వేరుగా ఉంటుందని ఉరేసుకొని...

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సాయికుమార్(24) దేవి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మద్యం తాగి తరుచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో భరించలేక భర్తతో కాక అదే కాలనీలో వేరుగా ఉంటుంది. భార్య తనతో ఉండడం లేదని మనస్తాపం చెందిన సాయికుమార్ మద్యం తాగి గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మద్యానికి బానిసై..

దుబ్బాకరూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. వేముల రవితేజ(27) గ్రామంలో టెంట్ హౌస్‌లో కూలీ పని చేస్తుండేవాడు. ఏడాది కిందట ప్రేమ వివాహం కాగా భార్యాభర్తల మధ్య గొడవలతో నెల రోజులకే విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి మద్యానికి బానిసైన రవితేజ తాగిన మత్తులో 7న గ్రామ శివారులో గడ్డికి పిచికారీ చేసే మందు తాగాడు. ఈ విషయాన్ని మిట్టపల్లి సుధాకర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అతడు వచ్చి దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి రాజన్నసిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.